# ఆశ్రమం

**-వి.రాఘవేంద్రరావు**

'విజయ్‌కి విడాకులు వచ్చేసాయి'

ఆ మాట చెవిన పడగానే అవాక్కయ్యాడు ఆనందరావు. ఒక్క క్షణం నిర్విణ్ణుడయ్యాడు. ఇంతవరకూ చేసిన ఆధ్యాత్మిక సాధన చిటికెడైనా కలసిరాలేదు. శీతోష్ణాలను సమతుల్యంగా సహించాలని రోజూ సత్ సంగంలో ఈ గీతోపదేశం వింటూనే ఉన్నాడు ఆనందరావు.

చివరికి తను ఆ పంజరంలోని చిలుక... రెండూ ఒక్కటేననిపించింది. 'రామ రామ' అంటూ జపం చేస్తున్న చిలక్కి పిల్లి కనబడగానే పై ప్రాణాలు పైకి ఎగిరిపోవడమూ, రాముణ్ణి మరచి అది కిచకిచలాడడమూ సహజమే. విజయ్‌కి అనూరాధ విడాకులు ఇచ్చిందని వినగానే తనూ ఆ చిలుకలా గిలగిలా తన్నుకున్నాడు. గుండె దరువు ఒక్క లిప్తపాటు ఆగిపోయింది.

"గురూ! ఇది నిజమా?'' నీరసంగా అతి కష్టంగా మాటలు ఊడిపడ్డాయి ఆనందరావు నోట.

"కాదు... జోక్ చేసానంతే'' అని గురుమూర్తి అంటాడేమో వినాలని అతగాడి తపన. కానీ ఆ భరించరాని మౌన వ్యాఖ్య 'నిజమేనోయ్' అంటూ వెక్కిరించింది ఆనందరావును.

ఊహించని సంఘటన చోటు చేసుకున్నప్పుడే ఆత్మజ్ఞానం తన కనురెప్ప కాస్త తెరుస్తుంది.

ఇదే మనిషి జీవిత రహస్యం. అప్పుడు తనని నడిపించే శక్తి ఒకటుందని తెలుస్తుంది.

ఆనంధరావుతోపాటు సత్సంగం సభ్యులందరూ విజయ్-అనూరాధల విడాకులు పుచ్చుకున్న వైనం విన్నప్పటినుంచీ బాధపడడమే కాదు... అసలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్ని సహృదయాల్ని కలిచివేయగల ఆ జంట తెచ్చిన తంటా వింటే ఎవరికైనా మతిపోవాల్సిందే.

నిస్సంగులైన సత్‌సంగులందరూ ఒక్క నిముషం కళ్లు మూసుకుని ధ్యానముద్రలో కూర్చున్నారు. ఆ ధ్యాన మందిరం అప్పుడు కదలని కొవ్వొత్తుల వెలుగుతో ఒకానొక రూపాంతర దేవాలయాన్ని తలపించింది.

గురుమూర్తి ప్రణవనాదం ముమ్మారు తన గొంతులో గంభీరంగా ధ్వనింపజేసి మెల్లగా కళ్లు విప్పాడు.

అదే సమయానికి నిద్రలోంచి మేల్కొన్నట్టుగా గురుమూర్తికి ఎదురుగానున్న ప్రేక్షక సమూహం కాస్త కదిలింది.

గురుమూర్తి మెల్లగా లేచాడు. భుజాన వేలాడుతున్న జోలెలో చేయివేసి ఓ శుభలేఖల దొంతరను పైకి లాగాడు. సభ్యులకి చేతికందిన పత్రికను తీసి చదువుకోవడానికి ఓ ఐదు నిముషాలు పట్టింది.

నిర్మలమైన కొలనులో ఓ రాయి పడగానే కలకలం బయలుదేరుతుంది. కొలను ఉపరితలం వలయాకారపు అలల తాకిడికి కాస్సేపు కకావికలమవుతుంది. తరువాత ప్రశాంతత నెలకొంటుంది.

క్రమశిక్షణకు అలవాటుపడ్డ ఆ సత్సంగ సభ్యులూ ఆ కొలనులాగే ప్రవర్తించారు. అందరిలో కాస్త చొరవ చూపగల వాడు ఆనందరావు ఒక్కడే.

"గురూ! ఇంతకీ ఆ రాబోయే కోడలు మహాలక్ష్మి గురించి ఇంతవరకూ చెప్పనేలేదు'' అన్నాడు సాహసించి.

గురుమూర్తి ఏకైక పుత్రరత్నం విజయ్ ఇండియాలో ఎంబిఏ పూర్తి చేసి ఇటీవలే అమెరికా వెళ్లాడు పైచదువులకు. ఏడాదికల్లా హైటెక్ ఉద్యోగం దొరికింది. మంచి జీతం. ఆంధ్రా యువతకి అపురూప స్వర్గం కదా అమెరికా దేశం.

మంచి ఉద్యోగం దొరికాక మంచి సంబంధం వెతికి పెళ్లి చేయాలి. అక్కడితో తల్లిదండ్రుల బాధ్యత తీరిపోతుంది. గురుమూర్తి అలాగే అనుకున్నాడు. ఇప్పటి సత్సంగత్వం విజయ్ పెళ్లి కాగానే నూటికి నూరుపాళ్లు నిస్సంగత్వం అవుతుంది. తండ్రిగా తన బాధ్యత తీరిపోతుంది. తల్లి లేని లోటు విజయ్‌కి కనిపించకుండా ఇంతవరకు పెంచి పెద్ద చేసాడు.

విజయ్ ఈ సభ్యులందరికీ పరిచయమే. చాకులాంటి కుర్రాడు. చదువుకున్నానన్న గర్వం ఏ కోశానా లేదు. వినయ విధేయతల్లో తండ్రికి మించిన తనయుడు. పెళ్లి ఈడు ఆడపిల్లలున్న సత్సంగ సభ్యులు విజయ్‌మీద ఓ కన్నువేసి ఉంచారు.

ఈ శుభలేఖతో వాళ్ల ఆశలు నీరుగారిపోయాయి. నిట్టూర్పుతో వినిపించకపోయినా విజయ్ తన జీవిత భాగస్వామిగా ఎన్నుకున్న ఆ అమ్మాయి ఎలా వుంటుందో తెలుసుకోవడానికి అందరితోపాటు వాళ్లూ ఉవ్విళ్లూరుతున్నారు.

"అమ్మాయి పేరు అనూరాధ'' వివరాలు మొదలుపెట్టాడు గురుమూర్తి. అందరూ చెవులు పెద్దవి చేసి వింటున్నారు.

"ఎన్ఆర్ఐ అనుకుంటాను'' అడ్డు తగిలాడు ఆనందరావు.

గురుమూర్తి మెత్తగానే ఒకటి అంటించాడు ప్రథమ శిష్యుడికి.

"నేను మాట్లాడాక మీరు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతాను" అన్నాడు నవ్వుతూ.

ఆనందరావు నోటికి ఆటోమేటిగ్గా తాళం పడింది.

"అనూరాధ అమెరికాలో పుట్టింది. కాబోయే విజయ్ అత్తగారు అసలు పుట్టింది కోల్‌కతా నగరంలో. పై చదువుకు అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడింది. చదువు పూర్తి కాగానే తను ప్రేమించిన అమెరికా యువకుడిని పెళ్లాడింది. అనూరాధ ఏకైక సంతానం. పుట్టిన ఊరికి, దేశమాతకీ దూరమైనా ఆ తల్లి కన్నకూతురు అనూరాధని హైందవ సంప్రదాయంలోనే పెంచి పెద్ద చేసింది. మంచి ఉద్యోగం, మంచి సంపాదన. విజయ్ ఇద్దరికీ నచ్చాడు" సంచిలోంచి భద్రంగా బయటకి తీసాడు ఓ ఫోటో గురుమూర్తి.

"ఈ అమ్మాయే పెళ్లికూతురు"

అందరికీ కనిపించేలా చెయ్యెత్తి ఫోటో చూపించాడు. ఆ తరువాత ఆనందరావు అందుకున్నాడు. ఫోటో చూసిన వాళ్ల కళ్లు చేటంతయ్యాయి.



నుదుట ఉదయసూర్యుడిలా మెరిసే కుంకుమ రేఖ, ముచ్చటైన చీరకట్టుతో మిలమిలలాడుతున్న నిండు విగ్రహం. ఇక మిగిలిందల్లా ఒకే ప్రశ్న. పెళ్లి ఎక్కడ? ఎలా?

ఏ సాంప్రదాయం ప్రకారం? అడగదలచింది అడిగేసాడు నిర్మొహమాటంగా ఆనందరావు.

"పెళ్లికూతురు తరఫు బంధువులు అమెరికాలోనే చేయాలని పట్టుబట్టారు. పెళ్లికొడుకు తరఫున వెళ్లవలసింది నేనొక్కడినే. వీళ్లని ఇబ్బంది పెట్టడం దేనికి?"

"మరి మా సంగతి ఏం చేసారు? మా గురించి కొంచెం ఆలోచించండి. మేం అమెరికా రాలేంకదా గురూజీ? మన సంప్రదాయం ప్రకారం మూడు ముళ్లు పడితే మంచిదికదా?"

గురుమూర్తి చిద్విలాసంగా మందహాసం చేసాడు.

"పెళ్లయిన తరువాత దంపతులు ఎలాగూ ఇండియా రాకమానరుగా?"

మీ ముచ్చట తీరాలంటే అందాకా ఆగాల్సిందేనన్న సందేశం విన్నవారంతా ఆనందరావుతోపాటు అవాక్కయ్యారు.

అయినా ఆనందరావు అంతరంగంలో ఏదో అసంతృప్తి. కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకని ఎన్నిసార్లు నచ్చచెప్పినా మనస్సు ఇంకా మొరాయిస్తూనే ఉన్నది.

అందుకు కారణం లేకపోలేదు. తల్లిలేని విజయ్ ఆడుతూ పాడుతూ ఎంబిఏ పాసై పై చదువులకు అమెరికా వెళ్లే పర్యంతం ఆనందరావు ఆ కుర్రవాడ్ని కొడుకులా చూసాడు. పిల్లల్లేని ఆనందరావు ప్రేమ ఆ పిల్లాడి చుట్టూ తిరుగుతోంది ఇంకా.

'పోనీ నువ్వు నాతోపాటు అమెరికా రమ్మని' గురుమూర్తి ఓ మాట అనలేదు. తనేం ఆర్థిక స్థోమత లేనివాడు కాదుకదా. అభిమానం అడ్డొచ్చింది. ఆగిపోయాడు.

***

చూస్తూ ఉండగానే కాలప్రవాహం దూకుడుగా దూకే కొండవాగుల్లా ఏళ్లు గడిచాయి.

విజయ్‌కి భారతమాత గురించిన ఆ ధ్యాసే కలగలేదు. అంతా సవ్యంగా జరిగిపోతున్నంతకాలం మనిషికి ఏదీ గుర్తుకురాదు. గురుమూర్తి సడెన్‌గా అందరిముందు విడాకుల కుండ బద్దలు కొట్టేసరికి ఆనందరావు అవాక్కయ్యాడు. అతడి మెదడు మొద్దుబారింది.

'ఎందుకిలా జరిగింది? ప్రేమించి పెళ్లాడాడు. ఏడడుగులు కలసి వేస్తే వీరు వారవుతారుకదా? అలాంటిది ఇన్నేళ్లయ్యాక కలసి కాపురం చేసి ఎలా విడిపోగలుగుతున్నారు?

ఉల్లిపొరలు విడదీస్తే చివరికి మిగిలేది ఏమీ ఉండదు కన్నీళ్లు తప్ప. విడాకుల వ్యవహారాలు చాలా చిన్న కారణాలవల్ల ఇటీవల పెట్రేగిపోతున్నాయి. హృదయానికి బదులు మెదడు చెప్పినట్టలా ఆడడమే నూటికి తొంభై శాతం అసలైన కారణం.

అందుకే మన సంప్రదాయంలో పెళ్లి దైవికం అన్న నమ్మకం. భార్యాభర్తల బంధం ఏడేడు జన్మల బంధం అని, ఏడడుగులు నడిపించి అగ్నిసాక్షిగా మూడుముళ్లు వేయిస్తారు.


'మాంగల్యం తంతు...' వెయ్యేళ్లు వర్ధిల్లమంటుంది. పెళ్లి నూరేళ్ల పంటగా, ఐదురోజుల సంబరంగా శోభాయమానంగా జరుగుతున్న కాలంలో షష్టిపూర్తిరోజు మళ్లీ పెళ్లి జరిగేది. కానీ ఈ రోజుల్లో అలా కాదుకదా.

ఆలూమగలు కీచులాడుకుని విడాకులకు సిద్ధమవుతున్నారు. కానీ సమాజంలో ఇమడలేకపోతున్నారు. తూర్పుపడమరల వైరుధ్య సంప్రదాయాల మధ్య ఎన్నో జీవితాలు నలిగిపోతున్నాయి. విజయ్ జీవితం ఇలా కావడం ఆనందరావుకి ఏమాత్రం మింగుడుపడలేదు.

***

గురుమూర్తి సాధనవల్ల కాస్తో కూస్తో యోగారూఢుడయ్యాడు అనక తప్పదు.


కొడుకు విజయ్ గురించి ఆలోచించడం మానేసాడు. ఆశ్రమం ఆయన్ని పూర్తిగా తనవైపు లాక్కున్నది. ఆశ్రమం స్వర్ణోత్సవ ప్రణాళిక రూపొందించడంలో తలమునకలైపోయాడు.



## సముద్రంలో అగ్నిపర్వతం

171 దీవుల సముదాయమైన టోంగా దేశానికి దగ్గరలో పసిఫిక్ మహాసముద్రంలో ఇటీవల ఒక అగ్నిపర్వతం విస్ఫోటించి 10 కిలోమీటర్ల దూరంవరకు తన నిప్పుల ధూళిని రోజుల తరబడి వెదజల్లుతూనే వుంది. దానివల్ల టోంగా రాజధాని నుకులోఫాదాకా చాలాసార్లు భూకంపాలు వచ్చాయి.

-తటవర్తి



ఆహ్వానపత్రిక చేతికి రాగానే ఆనందరావు బుర్రలో ఒక మెరుపు మెరిసింది.

ఆఖరిరోజు ఆశ్రమంలో హిందూ ధర్మ సంరక్షణ సమితి సామూహిక వివాహాలని నిర్వహించనున్న అంశం అతడి కళ్లబడింది. గురుమూర్తిని సంప్రదించకుండానే ఆహ్వాన పత్రికను యధాతథంగా విజయ్‌కి, అనూరాధకి వేరువేరుగా ఈమెయిల్ పంపించాడు.

"మీ సందేశం గమ్యం చేరింది'' అన్న జవాబు రాగానే అతని కళ్లల్లో ఆనందభాష్పాలు తొంగి చూసాయి.

త్రిగుణాత్మకమైన ప్రకృతి ప్రభావంవల్ల పరమాత్మ స్వరూపుడైన జీవాత్మ జీవుడైపోతాడు.

ఆత్మలక్షణాలు మరుగునపడి మానవ లక్షణాల ఆవహిస్తాయి. ఆ మానవుడు దానవుడు కావచ్చు, దేవుడిని తలపించనూవచ్చు. పరిసరాలు, పరిస్థితులు అలా కాటికి వెళ్లేదాకా వెంటాడుతూ శాసిస్తాయి.

బంధానికైనా, మోక్షానికైనా కారణం మనస్సేనని కూడా గీతా కృష్ణుడు విజయుడికి ఉపదేశించాడు. ప్రయోగశాలలో ఉష్ణోగ్రతనుబట్టి నీళ్లు మంచుగా మారుతుంది.

ఆవిరై కనిపించకుండా మాయమైపోతుంది. అందుకే తనూ ఓ ప్రయోగం చేసాడు ఆనందరావు గుట్టుగా.

★★★

ఆశ్రమంలో స్వర్ణోత్సవాలు వైభవంగా జరిగాయి. చివరి ఘట్టంలో అందరితోపాటుగా ఘనంగా, సంప్రదాయంగా విజయ్-అనూరాధలు మళ్లీ పెళ్లి చేసుకున్నారు.

సత్సంగ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ఆ దృశ్యాన్ని ఆనందంగా తిలకించాడు ఆనందరావు.

కొడుకు కోడలు కలసి రావడం వాళ్లని కలపడం కల అనుకున్నాడు గురుమూర్తి.

"నా హృదయం నీది కావాలి
నీ హృదయం నాది కావాలి''

సామవేద సారాన్ని వంద కొత్త జంటలతోపాటు విజయ్‌కి, అనూరాధకి అందజేసాడు పురోహితుడు.

ఒక్కొక్క పెళ్లి మంత్రం వల్లించి దాని అర్థాన్ని అందరికీ అర్థమయ్యేలా మైకులో విడమరచి చెబుతుంటే వింటున్నవాళ్లు 'అదీ సంగతి' అంటూ తొడ చరచుకున్నారు.

"ఈడూ జోడూ ఎంత చక్కగా కుదిరిందో'' అన్నది ఓ ముత్తయిదువు విజయ్ అనూరాధల్ని చూసి.

"మేడ్ ఫర్ ఈచ్ అదర్'' అన్నాడు ప్రక్కనే వున్న ఆవిడ పతిదేవుడు నవ్వుతూ ఆ జంట వంక చూస్తూ.

"చూసారా... ఆ ఇంగ్లీషు వాక్యంలోనూ ఎంత అర్థం దాగుందో'' అన్నాడు మరో పెద్దమనిషి.

"అందులో ఏ అర్థం వుంటుంది? ఈడూజోడూ అంటేనే ఎంతో అందం'' అన్నాడు ఓ భాషాభిమాని కల్పించుకుని.

"బ్రహ్మముడి అంటారు మనవాళ్లు. ఆ పదాలకు అదే అర్థం. అలా తీసేయకండి'' అన్నాడు మరో ఉభయ భాషా ప్రవీణుడు.

అందరూ 'బాగు...బాగు' అంటుంటే ఆనందరావు వాళ్లవైపు తిరిగి చూసాడు.

విజయ్, అనూరాధలు మరింత దగ్గరై గుసగుసలాడుతున్న దృశ్యం కళ్లబడింది.

అచ్చం పదహారణాల ఆంధ్రదేశపు పెళ్లికూతురే అనూరాధ అనిపించింది. భుజాన చేయి పడగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు ఆనందరావు. గురుమూర్తి!

"ఆ రోజు ఇది నిజమా గురూ?'' అని నన్ను అడిగావు. ఆ మాటే ఈ రోజు నీకు అప్పచెబుతున్నాను. నా కలను నిజం చేసావు'' అన్నాడు గురుమూర్తి మెల్లగా.

ఆయన రెండు కళ్లల్లో కనీ కనిపించని కన్నీటి కెరటాలు కదిలినట్టు అనిపించింది ఆనందరావుకి.

గురుమూర్తి రెండు చేతుల్ని ఆప్యాయంగా గుండెలపై అద్దుకున్నాడు ప్రథమ శిష్యుడు ఆనందరావు.

☆

## తమిళ కిక్ హీరోయిన్‌గా తమన్నా



'హ్యాపీడేస్'లాంటి బంపర్ హిట్ సినిమాలో నటించినప్పటికీ ఆ తర్వాత తమన్నాకి ఒక్క హిట్టూ లేకపోవడం విచిత్రంగానే అనిపిస్తుంది. అయితే తమిళనాట మాత్రం ఆమెకి ఎదురులేదన్నట్టుగా వుంది ప్రస్తుత పరిస్థితి. ఇప్పుడామె అరడజనుకి పైగా తమిళ సినిమాలు చేస్తూ బిజీగా వుంది. తెలుగులో తాజాగా హిట్టయిన 'కిక్' సినిమా తమిళ రీమేక్‌లో సైతం తమన్నా హీరోయిన్‌గా నటించడానికి ఎన్నికైందిట. ఇది కూడా కచ్చితంగా అక్కడ హిట్టయి తీరుతుందని సినీ పండితుల అంచనాలు. ఇక తమన్నా కెరీర్ జోరు జోరుగా వుంటుందన్నమాట.

